క్లుప్తంగా

కొనసాగుతున్న బెంతొరియాల రిలే నిరాహార దీక్షలు


రిలేదీక్షలో సూదిపుట్టుగ గ్రామ యువకులు

కవిటి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కవిటిలో బెంతొరియా సమాజికవర్గం ప్రతినిధులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 447వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలో సూదిపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. కుల, నేటివిటీ, పుట్టినరోజు, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లలో పూర్తి స్థాయిలో కులం, ఉప కులం లేకపోవడంతో నష్టపోతున్నామని.. వీటిని సరి చేయాలని కోరుతూ దీక్షలు చేస్తున్నట్టు తెలిపారు.

టెక్కలిలో ట్రాఫిక్ ఇక్కట్లు!


తెంబూరు రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణ వాసులు ట్రాఫిక్ ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. అంబేడ్కర్, ఇందిరాగాంధీ, తెంబూరు రోడ్డు జంక్షన్లు, చిన్నబజార్ జంక్షన్, రైల్వే స్టేషన్, గోపీనాథపురం రైల్వేగేటు సమీపంలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా తెంబూరు రోడ్డు జంక్షన్‌లో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద గేటు వేసే సమయంలో నౌపడ, తెంబూరు, పలాస, శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోతుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్‌ను సరిచేసేందుకు పోలీసులు లేకపోవడంతో కొంతమంది వాహనదారులు వారి ఇష్టం వచ్చినట్లు రోడ్డును క్రాస్ చేస్తుండడంతో మిగిన వారు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైన పోలీసులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని వాహనదారుల కోరుతున్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కంచిలి: రాష్ట్రంలో 1998 బ్యాచ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎంటీఎస్ రాష్ట్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును అమరావతి సెక్రటేరియట్‌లో మంగళవారం కలిసి కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసును మిగతా ఉపాధ్యాయుల మాదిరిగా 62 సంవత్సరాలకు పెంచాలని, జీతాలను కూడా ఏడాదిలో 12 నెలలు ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ప్రతినిధి శ్యామ్‌సుందర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉన్నారు.

డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ


మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థినులు

ఇచ్ఛాపురం టౌన్: జాతీయస్థాయిలో నిర్వహించిన ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశ పరీక్షలో ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన ముగుర్లు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఎమ్మెస్సీ ఐఐటీ, ఎన్ఐటీ కోర్సుల్లో ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్షకు హాజరైన వారిలో బాకి ఈశ్వరి 462, గుడియా జ్యోతి 786, బాడిత్య పూజితా 1333 ర్యాంకులు సాధించారు. వీరు గత ఏడాది డిగ్రీ పూర్తి చేయగా.. కెమిస్ట్రీ ఉపాధ్యాయులు ఏడాదిగా శిక్షణ ఇచ్చారు. ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ రబీన్ కుమార్ పాడి మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు కె.శ్రీనివాస్, దుర్యోధన దొళాయి, నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, లోకేశ్వరరావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బస్సు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం బొడ్డపాడు గ్రామ సమీప జాతీయ రహదారిపై మంగళవారం ఓ ప్రైవేట్ బస్సు ఇసుక ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు బొడ్డపాడు గ్రామ సమీపంలో ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. అయితే ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులెవరూ గాయపడకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ముందుభాగం కొద్దిగా పాడైంది. ఈ ఘటనపై కోటబొమ్మాళి పోలీసులు వివరాలు సేకరించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

వజ్రపుకొత్తూరు: యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్ఐ బి.నీహార్ అన్నారు. పెద్ద మురహరిపురంలో మంగళవారం పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. యువత మద్యంతో పాటు మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లేని హానికర పదార్థాలను అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్ఐ జిన్నారావు ఉన్నారు.

డొంకూరు.. లేదు నీరు!

- తీరప్రాంత గ్రామంలో దాహం కేకలు
- చెలమల నీరే మత్స్యకారులకు దిక్కు


నీటి కోసం చెలమ వద్ద మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: మండు వేసవిలోనైనా.. భారీ వర్షాలు కురిసినా ఆ గ్రామస్తులు మాత్రం నిత్యం మంచినీటికి కటకటలాడుతుంటారు. గుక్కెడు నీటి కోసం వేకువ జాము నుంచి సముద్ర తీరంలోని చెలమల వద్ద పడిగాపులు కాస్తుంటారు. దశాబ్దాల నుంచి వస్తున్న ఈ సమస్యను తీర్చేందుకు అటు అధికారులు, ఇటు ప్రభుత్వాలు చొరవ చూపించకపోవడంతో తాగునీటికి ఆ గ్రామ ప్రజలు భగీరథ ప్రయత్నాలు చేస్తుంటారు. మార్చి నెల మొదటి వారం నుంచే ఎండలు తారెత్తిస్తున్నాయి. దీంతో ఇచ్ఛాపురం మండలంలోని ఏకైక మత్స్యకార గ్రామం డొంకూరు తీర ప్రాంతంలోని ప్రజలు దాహార్తితో అలమటించి పోతున్నారు. సుమారు నాలుగు వేల మంది జనాభా ఉన్న గ్రామంలో ఉన్న ఓపెన్ హెడ్ చానెల్ నుంచి వస్తున్న రక్షిత మంచినీరు కొంత మందికే పరిమితమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ ద్వారా కొన్ని వీధులకు పైప్‌లైన్లను వేశారు. మిగిలిన వీధులకు వేసే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో మూడు వందలకు పైగా గృహవాసులు మంచినీటికి నోచుకోక సముద్ర తీరంలోని ఇసుక తిన్నెల్లోని ఊట నీటిని ఒడిసి పట్టుకొని గొంతు తడుపుకుంటున్నారు. ఇసుక తిన్నెల్లో నుంచి వస్తున్న ఊట నీరు బిందెడు నిండాలంటే అరగంట ఆగాల్సి వస్తుందని మత్స్యకార మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కనీసం ట్యాంకుల ద్వారానైనా మంచినీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చెలమ నీటిని వడబోస్తున్న మహిళ

చెలమనీరే దిక్కు..



మా గ్రామంలో నీటి సమస్య తీవ్ర రూపంలో ఉంది. అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదు. కుళాయిలు కొన్ని వీధులకే పరిమితమయ్యాయి. మంచి నీరు లేకపోవడంతో చెలమల నుంచి వచ్చే నీటిని వడిబోసి తాగుతున్నాం. ఇలా తాగడం మాకు అలవాటుగా మారిపోయింది. సమస్యను పరిష్కరించాలి.

– లండ శాంతమ్మ, డొంకూరు

వేకువజాము నుంచి పడిగాపులు ..



బిందెడు నీటి కోసం చెలమల వద్ద వేకువ జాము నుంచి పడిగాపులు కాస్తుంటాం. పండుగలు, సంబరాలు సీజన్‌లో మరింత నరకంగా ఉంటోంది. ఎంతో మంది వచ్చి ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు గానీ మా సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. ప్రభుత్వం కనీసం ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తే కొంతమేర నీటి కష్టాలు తీరుతాయి.

– బుడ్డ గీత, డొంకూరు

ఆవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- 37 ఆవులు స్వాధీనం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నారాయణవలస గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఆవులను కోటబొమ్మాళి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నారాయణవలస నుంచి లారీలో ఆవులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు కోటబొమ్మాళి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. లారీలో తరలిస్తున్న 27 ఆవులను పట్టుకున్నారు. అలాగే జర్జంగి సమీపంలో కూడా అక్రమంగా వాహనంలో తరలిస్తున్న ఏడు ఆవులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 34 ఆవులను సింహాచలం గోశాలకు తరలించిట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోటబొమ్మాళి ఏఎస్సై ఐ.శంకరరావు తెలిపారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


నినాదాలు చేస్తున్న మీటర్ రీడర్లు

టెక్కలి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లుగా పనిచేసిన సిబ్బంది కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లతో తాము ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయగా ఉపాధి చూపించాలని కోరారు. గతంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన చర్చల్లో భాగంగా ప్రస్తావించిన అంశాలను తక్షణమే అమలు చేయాలని, అలాగే రీడర్స్‌గా పనిచేస్తున్న వారిలో ఐటీఐ, ఇతర టెక్నికల్ అర్హత కలిగిన వారికి కార్యాలయాలు, సబ్ స్టేషన్‌లలో ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పి.శ్రీను, బివి.ప్రసాద్, పి.తులసీదాస్, కె.డిల్లేశ్వరరావు, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: ఆస్తిపన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సిబ్బందిని ఆదేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలు విషయమై చర్చించేందుకు మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది, అన్ని సచివాలయాల సెక్రటరీలు, ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి వారితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతశాతం పనులు వసూలు చేయాలన్నారు. ప్రజలు కూడా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. పన్నులు చెల్లించకుండా ఇబ్బందిపెట్టేవారికి ప్రభుత్వ సేవలు సైతం అందకుండా చర్యలు ఉంటాయన్నారు. మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: తాము చదువుకున్న పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. కొళిగాం ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్‌కు రూ.58 వేలు నగదును అందజేశారు. ఈ మొత్తాన్ని విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు అవసరమైన భోజనశాల నిర్మాణానికి అందజేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ తాము చదువుకు పాఠశాల అభివృద్ధికి ప్రతీ పూర్వ విద్యార్థి చేయూతనందించాలని కోరారు.

రావివలస ఆలయ ఈవోపై విచారణ


రావివలస ఎండల మల్లన్న దేవస్థానం ఈఓ గురునాథరావు పై చేసిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్న అధికారులు

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న గురునాథరావు నిర్లక్ష్య వైఖరితో చోటు చేసుకున్న తప్పిదాలపై చర్యలు తీసుకోవాలని కూటమి పార్టీల కార్యకర్తలు, ధార్మిక సంఘాల ప్రతినిధులు ఇటీవల దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసిన వారితో పాటు గ్రామస్తుల మధ్య అధికారులు మంళవారం విచారణ చేపట్టారు. గత ఏడాది జరిగిన కార్తీకమాసోత్సవాలు, తాజాగా జరిగిన శివరాత్రి ఉత్సవాల్లో ఈవో నిర్లక్ష్య వైఖరితో ఎంతో మంది భక్తులు అసహనానికి గురయ్యారని గుర్తు చేశారు. అంతే కాకుండా ఉత్సవాల నిర్వాహణలో భాగంగా దాతలు అందజేసిన విరాళాలను గోప్యంగా ఉంచడంపై నిలదీశారు. కార్తీకమాసోత్సవాల్లో తప్పిదాలు జరిగినప్పటికీ శివరాత్రి ఉత్సవాల్లో సైతం అవే సంఘటనలో పునరావృతం జరిగాయన్నారు. అంతేకాకుండా అప్పట్లో ఇదే ఈవోపై చేసిన విచారణ ఏం జరిగిందంటూ ప్రశ్నించారు. ఫిర్యాదుదారులు వెల్లడించిన వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. విచారణలో దేవదాయ శాఖ ఈవో మనస్వితో పాటు బి.జగదీష్, ఎన్.కృష్ణారావు, ఎ.జనార్దన్, సీహెచ్ లింగరాజు, ఎస్.షణ్ముఖరావు, కె.రామ్‌ప్రసాద్ ఉన్నారు.

30న ఉత్తరాంధ్రస్థాయి ఉగాది కవి సమ్మేళనం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సౌజన్యంతో పలాస లయన్స్ హాల్‌లో ఈ నెల 30వ తేదీ ఉదయం పది గంటల నుంచి విశ్వావసు నామ సంవత్సర ఉత్తరాంధ్రస్థాయి ఉగాది సమ్మేళనాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి బండారి కాళిదాసులు మంగళవారం తెలిపారు. కవి సమ్మేళనంతో పాటు పంచాంగ శ్రవణం, శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ వచన కవితలను ఈ నెల 25 తేదీలోగా 94403 34110 నంబర్‌కు వాట్సాప్‌లో పంపించాలని సూచించారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం రేపు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో కొలువైన షిర్డీ సాయిబాబా మందిరం 14వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఉలాసి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, 24 గంటల పాటు కళాకారులతో కచేరీ ఉంటుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సోంపేట: సోంపేట మండలం లక్కవరం గ్రామంలో పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు రోడ్డు పనులను ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడితోట దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

మందస: మేఘమాల గ్రామ సమీపంలో కొండపై ఉన్న జీడితోటలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒకఎకరా 30 సెంట్ల జీడితోట కాలిపోయింది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


కృష్ణమూర్తి (ఫైల్)

కాశీబుగ్గ: టెక్కలిపట్నం మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా 20 ఏళ్లు పని చేసిన కోరాడ కృష్ణమూర్తి (63) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. 1995 నుంచి 2013 సంవత్సరాల మధ్య సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించి పలు సేవలందించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు శంకుస్థాపన సభకు అధ్యక్షత వహించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో సభను పంచుకున్నారు. ఈయన సతీమణి కమలమ్మ కూడా సర్పంచ్‌గా పని చేశారు. కృష్ణమూర్తి మరణ సమాచారం తెలిసిన వెంటనే మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పలాస మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, ప్రస్తుత ఎంపీపీ ఉంగ ప్రవీణ, నందిగాం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కింతల ధర్మారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చాపర సుందర్‌లాల్‌లు టెక్కలిపట్నం వెళ్లారు. కృష్ణమూర్తి భౌతికకాయానికి నివాళులర్పించి.. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

శ్రీరామ నవమి శుభరాట



కంచిలి మండలంలోని తలతంపర గ్రామంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా శ్రీరామనవమి ఉత్సవాలకు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుభరాట వేసే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి, టీడీపీ నాయకుడు మత్రిపాటి పూర్ణ చంద్రరావు, భక్తులు పాల్గొన్నారు.

నవోదయంపై అవగాహన



సారా తయారీ, విక్రయాలు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని సోంపేట తహసీల్దార్ బి.అప్పలస్వామి మండల, గ్రామస్థాయి అధికారులకు సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో కలిసి నాటుసారా నిర్మూలనపై నవోదయం 2.0 అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, సీఐ బి.మంగరాజు, ఎక్సైజ్ సీఐ బేబి, పోలీసు, ఎక్సైజ్, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

–సోంపేట

ఐకమత్యంగా సమస్యల పరిష్కారం



టెక్కలి పట్టణంలో ఎండల మల్లికార్జునస్వామి నాయీబ్రాహ్మణ సేవా సంఘం ద్వారా ఐకమత్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయా సంఘ ప్రతినిధులు కోరారు. మంగళవారం స్థానిక జగతిమెట్ట సమీపంలో సేవా సంఘం సమావేశం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా సంఘాన్ని దిగ్విజయంగా కొనసాగించడంలో సభ్యులు ఎంతగానో సహకరిస్తున్నారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఎల్.రామారావు, ఎస్.వీరాస్వామి, ఐ.చిన్నారావు, ఐ.అప్పారావు పాల్గొన్నారు.

–టెక్కలి

జీడి పరిశ్రమను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్


జీడి పరిశ్రమలో కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

కాశీబుగ్గ: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ చైర్మన్ కేసలి అప్పారావు రెండోరోజైన మంగళవారం పలాస, మందస మండలాల్లో పర్యటించారు. అనంతపురం ఏరియాలో జీడి పరిశ్రమలను సందర్శించి మహిళలు, పురుష కార్మికులకు టాయిలెట్ సదుపాయాలు, సిక్ రూమ్స్, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కార్మికులకు ఈశ్రమ కార్డును లేబర్ డిపార్ట్‌మెంట్ సౌజన్యంతో చేయించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పలాస రూరల్, అర్బన్ పరిధిలో ఉన్న మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి వారి విధులను తెలియజేశారు. జిల్లా బాలలరక్షణ అధికారి కె.వి.రమణ, బాలల రక్షణ అధికారి మెట్ట మల్లేశ్వరరావు, సీడీపీవో డి.పార్వతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు, పలాస సీఐ సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.శివాజీ ఉన్నారు.

సమస్తం కృష్ణమయం


ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న వికాసస్వామి మహారాజ్

ఇచ్ఛాపురం: సృష్టి మొత్తం కృష్ణమయంతో నిండిఉందని ప్రఖ్యాత ప్రవచకులు త్రిదండి సన్యాసిపరమ పూజ్య శ్రీ భక్తి వికాస స్వామి మహారాజ్ అన్నారు. ఇచ్ఛాపురంలోని సురంగి రాజాక్రీడామైదానం ఆవరణలో మంగళవారం సాయంత్రం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం శ్రవణ కీర్తన మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నగర సంకీర్తన చేశారు. అనంతరం మైదానంలో నిర్వహించిన అధ్యాత్మిక కార్యక్రమంలో ప్రవచకులు మాట్లాడుతూ.. సృష్టిలో శ్రీకృష్ణుని స్మరించడం కన్నా ఉన్నతమైనది మరొకటి లేదన్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు


గాయపడిన శివకుమార్

మందస: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన కొర్రాయి గేటు సమీపంలో చోటుచేసుకుంది. మండల కేంద్రం మందసకు చెందిన తట్ట శివకుమార్ సోమవారం రాత్రి పలాస నుంచి మందసకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొర్రాయి గేటు వద్ద కుక్క అడ్డంగా రావడంతో అదుపుతప్పి బోల్తాపడడంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు శివకుమార్‌ను హరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

శివరాంపురం సమస్యలు పరిష్కరించండి

వజ్రపుకొత్తూరు రూరల్: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శివరాంపురం గ్రామంలో నెలకున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు కోరారు. ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులతో కలిసి మంగళవారం గ్రామంలో పర్యటించారు. రోడ్డు, మంచినీరు, విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు. పార్టీ నాయకులు ఎస్.మోహన్‌రావు, ఎన్.చంద్రయ్య, టి.భాస్కరరావు, బి.అప్పన్న ఉన్నారు.

నెలాఖరులోగా పన్ను బకాయిలు చెల్లించాలి

ఇచ్ఛాపురం: వివిధ పన్నుల బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇళ్లు, వాణిజ్య వ్యాపార సంస్థలు, ఖాళీస్థలాలు, ప్రకటనల రుసుములు, ఆక్రమణల రుసుములు, నీటి పన్నులను చెల్లించాలని సూచించారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు ఆర్.శాంతికుమార్, ఎ.లక్ష్మణరావు రచించిన స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ ఇంజినీర్స్ పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కంప్యూటర్ సైన్స్‌కు అనుసంధానంగా ఉన్న అన్ని బీటెక్ కోర్సులకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని వెల్లడించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.శ్రీరాములు, రత్నమణి, ఎం.రమణయ్య పాల్గొన్నారు.